క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఇటిక్యాలకు చెందిన సురేందర్‌కు రూ. 4 లక్షలు, నక్కలపల్లికి చెందిన తెలుగు ఆదిలక్ష్మి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉండవెల్లి: మండల కేంద్రానికి రాకేశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్రోహ దినాన్ని జయప్రదం చేయాలి

ధరూరు: ఈ నెల 23న పెన్షన్ విద్రోహ దినాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం అన్ని పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే భోజన విరామ సమయంలో సీపీఎస్ రద్దు మీద తహసీల్దార్లకు వినతిపత్రాలను అందజేయాలని పేర్కొన్నారు.

నూతన సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి



ధరూరు: గ్రామీణ ప్రాంతాల్లో నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని ఐకేపీ సీసీ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో స్నేహ ఎస్‌హెచ్‌జీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరి ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ పొందాలన్నారు. కొత్తగా పెళ్లి అయిన వారు సంఘాల్లో సభ్యులుగా చేరవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ రాములు, వీఓఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్



అయిజ: మండల కేంద్రంలోని బస్తీ దవాఖానలో శుక్రవారం వైద్య సిబ్బంది టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ హైరిస్క్ స్క్రీనింగ్ చేశారు. టీబీ పరీక్ష, ఎక్స్‌రే, టీబీ స్పూటుం, బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రాజు, డాక్టర్ కిరణ్‌కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి



అయిజ: రెవెన్యూ డివిజన్ చేసేందుకు అయిజ పట్టణానికి అన్ని అర్హతలు కలిగి ఉందని, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, వెంకటేష్, గిడ్డన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



మల్దకల్: మండలంలోని తాటికుంట, కుర్తిరావులచెర్వు, అమరవాయి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణాలను త్వరగా నిర్మించాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేసి పనులకు భూమిపూజ చేశారు. అదే విధంగా పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, ఏపీఓ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్లు నాగరాజు, ఇబ్రహీం, ఉమేరా, కార్యదర్శి శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్లపై ప్రయాణమెలా?



చెరువును తలపిస్తున్న తనగల ప్రధాన రహదారి

- రెండేళ్ల క్రితం రూ.4.36 కోట్లు మంజూరు
- మూడు మండలాల ప్రజల ఇక్కట్లు
- ఏడాది క్రితం పనులు ఆపిన కాంట్రాక్టర్

శాంతినగర్: గుంతలమయమైన రహదారి పనులు మొదలుపెట్టారని సంతోషించారు మూడు మండలాల ప్రజలు. పది రోజులపాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఏడాదిన్నర కాలంగా అడ్రస్ లేకుండా పోవడంతో వారి సంతోషం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. అధ్వాన్నంగా మారిన రహదారితో నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.4.36 కోట్లు మంజూరు

వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల నుంచి మాన్‌దొడ్డి– పెద్దధన్వాడకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ నేపథ్యంలో 2022లో రహదారి పనుల నిమిత్తం రూ.4.36 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకొని 2023లో పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ పది రోజులు జేసీబీతో పనులు చేపట్టి వదిలేశాడు. అప్పటి నుంచి 600 రోజులుగా తిరిగి చూడలేదు. పనులు చేపడితే బిల్లులు రావని తెలుసుకుని వదిలేసి వెళ్లినట్లు సమాచారం. ఏడాదిన్నరగా కాలంగా పనులు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి రోడ్డు చెరువును తలపిస్తుంది. కాంట్రాక్టర్ జేసీబీతో రోడ్డును తొలగించడంతో కంకరతేలి ప్రయాణానికి నరకంగా మారిందని ఆయా మండలాల ప్రజలు వాపోతున్నారు.



ప్రమాదభరితంగా పచ్చర్ల రహదారి

భారీ వాహనాలతో పాడైన రోడ్డు

వడ్డేపల్లి, అయిజ, రాజోళి మండలాల పరిధిలో నిర్మిస్తున్న భారత్‌మాల రోడ్డు పనుల నిమిత్తం భారీ వాహనాల్లో కంకర, ఎర్రమట్టి తరలించడం, రాజోళి మండల పరిధిలోని చిన్నధన్వాడ గ్రామ సమీపంలోని తుంగభద్ర నది నుంచి ఆయా మండలాలకు ఇసుక తరలించడంతో రోడ్డు ధ్వంసమైంది.

కుంటను తలపిస్తూ..

వెంకటాపురం స్టేజి నుంచి తనగల వరకు ఉన్న బీటీరోడ్డును తొలగించిన అనంతరం ఎర్రమట్టి వేశారు. భారీ టిప్పర్లు రోడ్డుపై వెళ్లడంతో గతుకుల మయమై గుంతల్లో నిలిచిన నీటిలో బురదమయమైంది. దీంతో కిష్టాపురం, తనగల గ్రామాల ప్రజలు కాలినడకన గ్రామాలకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనుల పూర్తి చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

బురదలో వెళ్లాల్సిందే



తనగల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. ప్రతిరోజు తనగలకు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్తుంటాం. బీటీరోడ్డు ఉన్న సమయంలో బాగుండేది. మట్టి తోలడంతో రోడ్డు బురదగా మారి కాలినడకన వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. – తిమ్మప్ప, విద్యార్థి, కిష్టాపురం, అయిజ మండలం

ప్రమాదాల పాలవుతున్నాం



గుంతలమయంగా ఉన్న బీటీ రోడ్డును తొలగించడంతో కంకర తేలింది. వాహనాలు వెళ్లే సమయంలో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంకటాపురం స్టేజి వద్ద ఎప్పుడు ఏ జరుగుతుందోనని భయపడుతూ వెళ్లాల్సి వస్తోంది. – దొడ్ల రాముడు, తనగల, వడ్డేపల్లి మండలం

నోటీసులు ఇచ్చాం

ఏడాది క్రితం పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేసి వెళ్లిపోయాడు. ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది త్వరగా పనులు చేయాలని సూచించాం. పట్టించుకోకపోవడంతో నోటీసులు పంపించాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను వివరించాం. – రెడ్డప్ప, పంచాయతీరాజ్‌శాఖ డీఈ, మానవపాడు డివిజన్

నానో యూరియాతో బహుళ ప్రయోజనాలు



నానోయూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజశేఖర్

మల్దకల్: నానో యూరియా వాడకంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం యూరియా కొరత నెలకొన్న నేపథ్యంలో రైతులు దీనిపై దృష్టి సారించాలన్నారు. మండలంలో రైతులకు ఎలాంటి యూరియా కొరత లేదని, ఎరువుల దుకాణాల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కేంద్రంలో యూరియాను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఖాజాపాష, రాహుల్ పైలెట్, భాస్కర్, కిషోర్, సుజాత పాల్గొన్నారు.

ఇనాం భూముల సమస్యలపై వినతి

గద్వాల: ఘర్షణలు, వివాదాలకు కారణమవుతున్న మండలంలోని ఎల్కూరు గ్రామంలో ఎస్సీలకు పంపిణీ చేసిన ఇనాం భూముల సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎల్కూరు 200 ఎకరాల ఇనాం భూమికి సంబంధించి చాలా కాలంగా పట్టా పాసు బుక్కులు ఇవ్వకపోవడంతో వివాదంగా మారిందన్నారు. ఈ క్రమంలో ప్రజాసంఘం నాయకుడు మహేష్‌పై కత్తిపోటు దాడి జరిగిట్లు పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి

మల్దకల్: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దొడ్డి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గర్భిణి, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచర్లు ధర్మావతమ్మ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత రానివ్వొద్దు

రాజోళి: రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని, యూరియా కొరత రానివ్వొద్దని కేవీపీఎస్, సీపీఎం నాయకుల అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓ బిందును కలిసి యూరియా కొరత లేకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. వందల టన్నుల యూరియా అవసరముంటే, ప్రభుత్వం పట్టకుండా యూరియా కొరత లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, బెంజిమెన్, భాస్కర్, చిన్న బడేసాబ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

ఇటిక్యాల: మండలంలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల బదిలీ అయినట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని బుడ్డారెడిపల్లి, శనగపల్లి, సాతర్లకు చెందిన కార్యదర్శులు రాజేశ్వరి, నీరేష్, వెంకటనారాయణ బదిలీపై వెళ్లగా వారి స్థానంలో రాజు, నీరేష్, రియాజ్ బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ రూపుమాపాలి

మల్దకల్: బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్కూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలలందరూ స్వేచ్ఛాయుత వాతవరణంలో పెరగాలన్నారు. బాలికలకు ఎదురవుతున్న లైంగిక వేధింపులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

మల్దకల్: మండలంలోని పాల్వాయిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను శుక్రవారం పంచాయతీరాజ్ ఏఈ బషీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు వినతుల మేరకు నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామిరెడ్డి, మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కల్పించేందుకు కృషి



రాజోళి: హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సమాచార హక్కును పరిరక్షించేందుకు సర్వదా కృషి చేస్తామని సమాచార హక్కు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నిషాక్ అన్నారు. శుక్రవారం పరిరక్షణ సమితి సభ్యులతో కలిసి కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమాచార హక్కుల పరిరక్షణ సమితి ఏర్పడటం హర్షణీయమని తెలిపినట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, సెక్రటరీ తిక్కయ్య, రవి, రామకృష్ణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



అలంపూర్ పోలీస్ స్టేషన్ వద్ద అరెస్టయిన బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: నియోజకవర్గంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సెక్రటేరియట్ ముట్టడికి పిలునిచ్చిన నేపథ్యంలో ఆయా మండలాల్లోని బీజేపీ నాయకులు హైదరాబాద్‌కు వెళ్లకుండా పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేశారు. అలంపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు గొంగళ్ల ఈశ్వర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రంగస్వామి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బంగారు లక్ష్మణ్, నాయకులు మధుసూదన్‌గౌడ్, బోయ రామకృష్ణ, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, భగత్‌రెడ్డి, గోపాలకృష్ణ, మురళీకృష్ణ, పిడుగు వెంకటేష్, జగదీష్‌రెడ్డి తదితర నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఉన్నత లక్ష్యంతో చదివితేనే భవిష్యత్



కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ప్రిన్సిపాల్ తదితరులు

గద్వాలన్యూటౌన్: ఉన్నత లక్ష్యంతో చదివినప్పుడే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఎంఏఎల్‌డీ కళాశాలలో 'విద్యార్థి వ్యాసాంగం' పేరుతో రూపొందించిన 'కళాశాల మ్యాగజైన్' ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులే పరిశోధన దృక్పథంతో వ్యాసాలు రాసి, పుస్తకంగా తీసుకరావడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్‌బాష మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి, పరిశోధన దృక్పథం కల్గించేందుకు విద్యార్థులు రాసిన వ్యాసాలతో విద్యార్థి వ్యాసంగం పేరుతో కళాశాల మ్యాగజైన్ తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం



మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలను ఎంఈఓ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు కల్పించే సౌకర్యాలపై శ్రద్ధ వహించాలన్నారు. రికార్డులు అప్‌డేట్ చేయాలన్నారు. ఇన్‌చార్జ్‌లు, ఏఎన్‌ఎంలు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. భోజనం నాణ్యతగా వడ్డించాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వైజ్ఞానిక మేళా



మాట్లాడుతున్న ఎంఈఓ భగీరథరెడ్డి

రాజోళి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం ఉపాధ్యాయులు మండలస్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్– టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి సెక్టోరియల్ అధికారి ఎస్తేర్ రాణి ఉపాధ్యాయులు రూపొందించిన ప్రదర్శనలను పరిశీలించారు. పుస్తకాల్లో ఉన్న తీరుని నేరుగా ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు బోధిస్తే ఎంతటి ప్రయోజనం చేకూరుతుందో ప్రదర్శన ద్వారా తెలియజేశారన్నారు. జిల్లాస్థాయిలో కూడా తమ ప్రదర్శన ఇవ్వనున్నట్లు ఎంఈఓ భగీరథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మెయినుద్దీన్, హనిమిరెడ్డి, కామేశ్వరి, రాణి, వాణి తదిదరులు పాల్గొన్నారు. ఎంఈఓ భగీరథరెడ్డి

పరిష్కారాలకు పోరాటాలే మార్గం



సభ్యత్వాలను అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు రమేష్

అలంపూర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని బీసీ బాలుర గురకుల పాఠశాలలో మహాధర్నా పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అదే విధంగా ఉండవెల్లి మండలంలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వాల నమోదు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం పీఆర్‌సీ, పెండింగ్ డీఏను తక్షణమే విడుదల చేయాలన్నారు. కేజీబీవీ టీచర్ల సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించడానికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న చలో హైదరాబాద్ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్‌నాయుడు, జిల్లా కార్యదర్శి వెంకటేష్, నరేష్, మునిస్వామి, గరీబ్ బాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ బాధితులకు భరోసా ఇవ్వండి

గద్వాల క్రైం: సైబర్ మోసాగాళ్ల చేతిలో సర్వం కోల్పోయిన బాధితులకు మనోధైర్యం అందించి వీలైనంత త్వరగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సైబర్ విభాగ ఎస్ఐ అబ్దుల్ షుకూర్ అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో సైబర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటి వరకు నమోదైన సైబర్ కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ టీకాల పంపిణీ

మానవపాడు: పశువైద్య, పశుసంవర్ధకశాఖ పంచాయతీరాజ్ సంయుక్తంగా రేబిస్ వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా మండల కేంద్రంలో రేబిస్ టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్య అధికారి డాక్టర్ పుష్పలత, డాక్టర్ హరిప్రియ మాట్లాడారు. కుక్కల పెంపకంలో యాజమానులు తప్పనిసరిగా రేబిస్ నివారణ టీకాలు వేయించాలన్నారు. 100 డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేటర్ మంగమ్మ, కార్యదర్శి శివశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే పనుల జాతర

సాక్షి నెట్‌వర్క్: ప్రజా సంక్షేమం కోసమే పనుల జాతర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. శుక్రవారం పనుల జాతర సందర్భంగా రాజోళి మండలం పచ్చర్ల గ్రామంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కుమార్‌తో కలిసి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే విధంగా భవన నిర్మాణాలు చేయడం, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా క్యాటిల్‌షెడ్, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, సిబ్బంది తదిదరులు పాల్గొన్నారు.

■ ప్రజల సంక్షేమం కోసమే పనుల జాతర ప్రారంభించినట్లు అన్నారు. గట్టు మండల పరిధిలోని గంగిమాన్‌దొడ్డిలో రూ.25 లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నర్సింగరావు భూమి పూజ నిర్వహించారు. అనంతరం గట్టు రైతు వేదికలో ఉపాధి పనుల జాతర– 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ కేటీదొడ్డి మండల కేంద్రానికి ఫోర్‌లైన్ రోడ్డు మంజూరయ్యేటట్లు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మైలగడ్డలో పనుల జాతర కార్యక్రమంపై సమావేశం నిర్వహించి పనుల జాతర కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కోళ్ల ఫారం, కుటీర పరిశ్రమలు, గొర్రెల షెడ్డు, మామిడి తోటలు మంజూరైన వారికి ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పచ్చర్లలో రిబ్బన్ కట్‌చేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, తదితరులు

■ మానవపాడు మండలంలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో పనుల జాతర– 2025 పనులను ఎమ్మెల్యే విజేయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ, సీడీపీఓ సుజాత, ఎంపీఓ విజయశంకర్, నాయకులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనుల జాతర కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. జిల్లెడుదిన్నె, జూలెకల్ గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, వెంకట్రామనగర్‌లో పంచాయతీ భవన నిర్మాణాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

■ అలంపూర్ మండలం బుక్కాపురంలో పశువుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాశీపురంలో పంచాయతీ భవన నిర్మాణం, ర్యాలంపాడులో పశువుల షెడ్డును మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప ప్రారంభించారు.



ప్రాగటూరులో అంగన్‌వాడీ కేంద్రానికి భూమి పూజ చేస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప

■ ఎర్రవల్లి మండల కేంద్రంలో ఎంపీడీఓ అబ్దుల్ సయ్యద్‌ఖాన్, వేములలో ఇటిక్యాల ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, పుటాన్‌దొడ్డిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.

■ ఉండవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీఓ సౌజన్య ఆధ్వర్యంలో వాటర్ హార్వేస్టింగ్ నిర్మాణానికి ఏపీడీ శ్రీనివాసులు, డీటీసీ విద్యాధర్ భూమి పూజ నిర్వహించారు. ప్రాగటూరులో అంగన్‌వాడీ కేంద్రానికి, ఇంకుడు గుంతలకు, మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప భూమి పూజ చేశారు. మారమునగాల-1లో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.

■ ఇటిక్యాల గ్రామాలో మౌలిక వసతుల కల్పనకు పనుల జాతర కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. మండల పరిదిలోని శివనంపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సలీం, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, కార్యదర్శి రేణుక పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల కె.రీలాంజనేయులు - 9642913894
అలంపూర్/అయిజ ఎన్.గోవర్ధన్ - 9948797122
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బర్ లాల్ : 9553955603